www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 30 ఆగస్టు 2024



నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుండి ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జెడ్‌పి సిఇఒ కెఎస్-ఎస్.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌ఎలు, ఎంపీలను స్థాయి సంఘాల్లోకి ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

కొల్లేరులో వసూల్ రాజాలు..!



ఐదో కాంటూరు కింద ఉన్న చేపల చెరువులపై నేతల కన్ను

ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని హుకుం

వేలాది ఎకరాల నుంచి వసూళ్లకు రంగం సిద్ధం

జనసేన ప్రజాప్రతినిధి ఉన్నచోట టిడిపి నేతలదే పెత్తనం

చిన్నా, చితకా రైతులకు దిక్కుతోచని దుస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరులో వసూళ్ల రాజాలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. కొల్లేరు గ్రామాల పరిధికి చెందిన ఆయా నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు వసూళ్ల దందాకు తెరలేపినట్లు చెబుతున్నారు. ఐదో కాంటూరు కింద ఉన్న చేపల చెరువుల నుంచి ఎకరాకు రూ.15 వేలు చొప్పున మామూళ్లు చెల్లించాలని చెరువుల యజమానులకు హుకుం జారీ చేసినట్లు ప్రచారం సాగుతోంది. కొల్లేరు గ్రామాలు ఉన్న నియోజకవర్గాల్లోని నాయకులే ఈ దందాకు పూనుకున్నట్లు చర్చ సాగుతోంది. దీంతో చెరువులు తవ్వుకున్న చిన్నాచితక రైతుల్లో అయోమయం నెలకొంది. సొమ్ము చెల్లించకపోతే తీవ్ర ఇబ్బందులు పెట్టే పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు. 2006లో అప్పటి ప్రభుత్వం 'ఆపరేషన్ కొల్లేరు' పేరుతో చేపల చెరువులను ధ్వంసం చేసింది. దీంతో కొల్లేరు గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. దీంతో కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని కొల్లేరు ప్రజలు ఎన్నోఏళ్లుగా ఆందోళనలు, నిరసనలు చేపట్టడంతోపాటు, ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికల్లో కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన టిడిపి, బిజెపి కూటమి తెలిపింది. భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో అప్పట్లో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ సైతం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక టిడిపి, బిజెపి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో కొల్లేరు ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. దిద్దుబాటు చర్యలకు దిగిన అప్పటి టిడిపి కూటమి ప్రభుత్వం కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపింది. కేంద్రంలోని మోడీ సర్కార్ పట్టించుకోలేదు. దీంతో అనధికారికంగా ప్రజాప్రతినిధులంతా కొల్లేరులో చేపల చెరువుల తవ్వకాలకు సహకరించారు. కైకలూరు, ఉంగుటూరు, ఉండి, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రాంతం విస్తరించి ఉంది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత సైతం కొల్లేరులో అనధికారికంగా చేపల చెరువుల తవ్వకాలను ప్రోత్సహించారు. ప్రజాప్రతినిధులే చేపల చెరువుల్లో వాటాలు తీసుకుని తవ్వించిన పరిస్థితి ఉంది. దెందులూరు నియోజకవర్గంలో కొల్లేరు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య చెరువుల తవ్వకాలు, వాటాల సొమ్ము కోసం ఘర్షణలు సైతం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. కొల్లేరులో వైసిపి నాయకుల దందాపై అప్పట్లో తీవ్ర దుమారం రేగింది

ఇప్పుడు మరో రకం దందా..!

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కూటమి పార్టీల నాయకులు కొల్లేరులో చేపల చెరువుల నుంచి దందాకు తెరలేపినట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. కొత్తగా చేపల చెరువుల తవ్వకాలకు ఇబ్బంది ఉండటంతో తవ్వకాలు జరిపిన చెరువుల నుంచి సొమ్ము వసూళ్లకు దిగినట్లు తెలిసింది. ఐదోకాంటూరు కింద తవ్వకాలు జరిగిన చేపల చెరువుల యజమానులు ఎకరాకు రూ.20 వేలు చెల్లించాలని హుకుం జారీచేయగా, తర్జభర్జనల అనంతరం ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని చెప్పినట్లు తెలుస్తోంది. ఐదో కాంటూరు కింద వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. దీంతో రూ.కోట్లలో వసూళ్ల దందా సాగనున్నట్లు చర్చ సాగుతోంది. ఆయా నియోజకవర్గ నాయకులకు సొమ్ము చేరేలా ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. జనసేన ప్రజాప్రతినిధి ఉన్న నియోజకవర్గంలో టిడిపి నేత చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సదరు ప్రజాప్రతినిధికి తెలిసే ఈ దందా జరుగుతుందా.. లేదా అనే చర్చ సైతం సాగుతోంది. వసూళ్ల దందా తెలిసి చిన్నచితకా రైతులు తీవ్ర ఆలోచనలో పడ్డారు. సొమ్ము చెల్లించకపోతే ఫారెస్ట్ అధికారులను ఉసిగొల్పి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఏర్పడనుందని ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా సొమ్ము వసూలు చేయడం ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా ఉందనే భావన ఆయా పార్టీల్లోని దిగువస్థాయి నేతల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వ పెద్దలు దీనిపై ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

తీరు మారదు.. రోగం తగ్గదు..!

మంత్రి ఆదేశించినా మెరుగుపడని ఆహారం నాణ్యత

ఉడకని గుడ్లు, బెండకాయ కూరలో పురుగులు

అర్ధాకలి.. అపరిశుభ్రత నడుమ విద్యార్థులు సతమతం

నూజివీడు ట్రిపుల్ ఐటిలో మరో 121 మంది విద్యార్థులకు అనారోగ్యం

కళాశాలను సందర్శించిన జడ్జిలు, అధికారులు

భోజనం నాణ్యతపై అసహనం, అసంతృప్తి

ప్రజాశక్తి - నూజివీడుటౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటి అధికారుల పర్యవేక్షణా లోపం.. మెస్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వెరసి కళాశాలలో గురువారమూ విద్యార్థుల అస్వస్థత పరంపర కొనసాగింది. మరో 121 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవ్వడం వారిలో 114 మంది ఓపిలో చికిత్స పొందగా మరో ఏడుగురు ఇన్‌పేషెంట్లుగా కళాశాల ఆవరణలోని ఆసుపత్రిలో చేరడమే దీనికి నిదర్శనం. కళాశాల ఆవరణలో నూజివీడు, శ్రీకాకుళం



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

క్యాంపస్‌లకు చెందిన సుమారు 10,800 మంది విద్యార్థులు ఉండగా ఇప్పటికే తొమ్మిది వందల మందికిపైగా విద్యార్థులు రోగాల బారిన పడి చికిత్స పొందుతున్నారు. జ్వరం, ఒళ్లు నొప్పులు, నరాల పోటు, జాయింట్స్ పెయిన్, డయేరియా, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

మంత్రి ఆదేశించినా నాణ్యమైన భోజనం నిల్

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై కళాశాలలోనే బుధవారం అర్ధరాత్రి వరకూ రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సమీక్షించారు. ఆహార నాణ్యతను పెంచి విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశించారు. అయితే గురువారం ఉదయం మళ్లీ ఉడకని కోడిగుడ్లు, ఉప్మా అల్పాహారంగా పెట్టడంతో విద్యార్థులు తినలేక పారేశారు. మధ్యాహ్నం భోజనంలో అదే పరిస్థితి పునరావృతమైంది. నీళ్ల చారు, నీళ్ల మజ్జిగ, పురుగులతో నిండిన బెండకాయ కూరతో అన్నం తినలేక విద్యార్థులు పస్తులున్నారు.

కళాశాలలో పరిస్థితులను ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖాధికారుల బృందం పరిశీలించి ఆహార నాణ్యత, కిచెన్‌లో అపరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేసింది.

గురువారం సాయంత్రం ఆర్‌డిఒ భవానిశంకరి కళాశాలలో



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రజారోగ్య శాఖాధికారులు

ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మెస్‌లో భోజనం చేసి ఆహార పదార్థాల నాణ్యతపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఒ విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలపై లిఖితపూర్వకంగా ఇస్తే తాను కలెక్టర్‌కు నివేదిక ఇచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.



మంత్రి పార్థసారథి అసహనం



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జడ్జిలు

జడ్జిలు పరిశీలన

ట్రిపుల్ ఐటి కళాశాలను గురువారం రాత్రి అదనపు జిల్లా జడ్జి నాగ శైలజ, సివిల్ జడ్జి షేక్ పెద్ద ఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ వి.కృష్ణమూర్తి, నూజివీడు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇందుపల్లి సత్యప్రకాష్ సందర్శించారు. కళాశాలలోని మెస్‌లను బృందం పరిశీలించింది.

తక్షణం మెరుగైన చికిత్స, ఆహారం అందించండి

కారకులపై చర్యలు తీసుకోండి: సిపిఎం

నూజివీడు ట్రిపుల్ ఐటిలో సుమారు తొమ్మిది వందల మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకుని విద్యార్థులకు మెరుగైన చికిత్సతోపాటు నాణ్యమైన ఆహారం అందించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు. యుద్ధప్రాతిపదికన కళాశాలలో, మెస్‌లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పరిస్థితి దారుణంగా ఉన్నా, మంత్రి ఆదేశించినా ఆహారం నాణ్యత మెరుగుపర్చని, మెస్‌లను పరిశుభ్రంగా ఉంచని కాంట్రాక్టర్, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

జనసేన బృందం పరిశీలన

నూజివీడు ట్రిపుల్‌ఐటిలో పరిస్థితులను జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తోటా వెంకట్రావు, బొబ్బిలి శ్రీకాంత్, పాశం నాగబాబు, కడియం శ్రీను, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతోనే శారీరక, మానసిక దృఢత్వం

ఉల్లాసంగా జాతీయ క్రీడా దినోత్సవం 3కె రన్

వ్యాయామం ద్వారా ఫిట్ ఏలూరు

జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి




3కె రన్‌ను ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శారీరక, మానసిక దృఢత్వానికి ప్రతిఒక్కరి నిత్యజీవితంలో వ్యాయామం అంతర్భాగం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక ఇండోర్ స్టేడియంలో ముగింపు కార్యక్రమంలో 3కె రన్‌ను జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి క్రీడాజ్యోతి వెలిగించి జెండాఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా కార్యక్రమం స్ఫూర్తితో ఫిట్ ఏలూరు జిల్లాగా రూపొందించేందుకు వ్యాయామం ప్రతిఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలన్నారు. జిల్లాలో జాతీయ క్రీడోత్సవాలు ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు నిర్వహించామన్నారు. నిత్యజీవితంలో ప్రతిఒక్కరూ రోజులో 30 నిమిషాలు వ్యాయామానికి కేటాయిస్తే వారికి ఎటువంటి ఆరోగ్య సమస్యలూ రావని తెలిపారు. జిల్లాలో క్రీడల పట్ల ప్రతిఒక్కరికీ ఉత్సాహం ఉందని, దీనిని అభివృద్ధి చేసుకుని జిల్లాస్థాయి నుండి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ఏలూరు జిల్లా క్రీడాకారులు నెంబర్ వన్‌గా ఉండాలని అన్నారు. ఏలూరు జిల్లా ఆరోగ్య ఫిట్ జిల్లాగా రూపొందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. 3కె రన్ స్టేడియం నుంచి కొత్త బస్టాండు మీదుగా ఫైర్ స్టేషన్ వద్దకు చేరుకుంది. అక్కడ క్రీడాకారులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరేట్ వరకూ క్రీడా ర్యాలీ సాగించారు. ఈ 3కె రన్‌లో క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయులు, ఎన్‌సిసి విద్యార్థులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 26 నుండి 29 వరకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు కలెక్టర్ వెట్రిసెల్వి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా హాకీ మాంత్రికుడు పద్మభూషణ్, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి క్రీడల్లో ప్రతిభ కనబరచిన, జాతీయ స్థాయిలో అవార్డులు పొందిన వారికి, కోచ్‌లకు, క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఆర్థిక ప్రోత్సాహకాన్ని ఇస్తున్న దాతలకు కలెక్టర్ పూలమొక్క ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన బాలికలు, బాలురకు అవార్డులు, సర్టిఫికెట్లను అందజేశారు. పోటీల్లో భాగస్వాములైన ప్రభుత్వ ఉద్యోగులకూ బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కలెక్టర్ వెట్రిసెల్వి పాల్గొని మొదటి బహుమతి సాధించడం విశేషం. ఆమెకు జిల్లా అధికారులు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఇఒ ఎస్.అబ్రహాం, డివైఇఒ బి.ప్రభాకరరావు, డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎవరిచ్చినట్టు?



సంతకం లేకుండా ఉన్న సర్టిఫికెట్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడా మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి అయిన ఆగస్టు 29 జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం సర్టిఫికెట్లు బహుకరించారు. అయితే ఆ సర్టిఫికెట్లపై ఎలాంటి సంతకం లేకపోవడం గమనార్హం. క్రీడా పోటీల్లో అయినా, సాంస్కృతిక పోటీల్లో అయినా, ఏ పోటీలో అయినా, అంశం ఏదైనాప్పటికీ ఇచ్చే సర్టిఫికెట్‌లో అథారిటీ సంతకం లేకపోతే ఆ సర్టిఫికెట్‌కు విలువ ఉండదనే విషయం జిల్లా స్థాయి అధికారులకు తెలియకపోవటం విడ్డూరంగా ఉందని అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. అక్కడ సంతకం లేకపోవడమే కాక కనీసం ఇష్యు అథారిటీ పేరు కూడా ప్రింట్ చేయకపోవడం గమనార్హం.

31నే పింఛన్ల పంపిణీ

జిల్లాలో 2,65,992 మందికి

రూ.113.67 కోట్లు : కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

సెప్టెంబరు నెల పెన్షన్ల చెల్లింపులను సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా ఈ నెల 31వ తేదీనే అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం సెప్టెంబరు నెల పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 31వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. శనివారం రోజున ఏదైనా కారణంతో పెన్షన్లు తీసుకోనివారికి సెప్టెంబరు రెండో తేదీన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లాలో సెప్టెంబరు నెలలో 2,65,992 మంది పెన్షన్‌దారులకు రూ.113.67 కోట్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఆగస్టు 31వ తేదీనే వంద శాతం పెన్షన్లు పంపిణీ చేసేలా అధికారులందరూ పని చేయాలన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలను అరికట్టాలి : ఐఎఫ్‌టియు



ప్రదర్శన చేస్తున్న ఐఎఫ్‌టియు నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పారిశ్రామిక ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం ఏలూరు వన్‌టౌన్ ఏరియా కల్పన థియేటర్ దగ్గర నుంచి చందన మెయిన్ రోడ్డు, పాత బస్టాండ్ వరకు ప్రదర్శనగా వెళ్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా బద్దా వెంకట్రావు, యర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక వాడల్లో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, సెజ్ చట్టాన్ని ప్రవేశపెట్టడం వల్ల, పర్యవేక్షణ అధికారులు చెకప్ లేకపోవటం వల్ల, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ప్రభావమే ఈ ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. స్వయంగా రాష్ట్ర హోం మంత్రి చెప్పిన దాని ప్రకారం అచ్యుతాపురం బేస్ సెజ్ ప్రాంతంలో 250 పరిశ్రమలు ఉన్నాయని, అందులో 220 పరిశ్రమలు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయని వారి ఎంక్వైరీ రిపోర్టులో తేలిందని చెప్పారు. ఎటువంటి చట్టాలు వర్తించని (ప్రత్యేక ఆర్థిక మండలి) సెజ్‌ల ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయనేది ప్రభుత్వమే అంగీకరించినప్పుడు, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి యజమానులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

తెలుగు భాషా వైభవానికి పునాది గిడుగు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ తెలుగుభాషా ఔన్నత్యాన్ని చాటిచెప్పిన గొప్పవ్యక్తి గిడుగు రామ్మూర్తి అని అన్నారు. ఆయన జయంతి ఆగస్టు 29న తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎల్‌డిఎం డి.నీలాద్రి, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

నేడు జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని ప్రతి గ్రామం, పట్టణం, నగరంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేడుకలా చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు నిర్దేశించారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నూజివీడు నగర వనంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. జిల్లాలో ఐదు లక్షల మొక్కలు అందుబాటులో ఉన్నప్పటికీ ఈ నెల 30వ తేదీన లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని బతికించుకునేలా సంరక్షించుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి కార్యాలయంలో సిబ్బందితో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. ముఖ్యం గా రెవెన్యూ సిబ్బంది అందరూ మొక్కలు నాటాలని ఆమె స్పష్టం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిదులు, ప్రజలు, స్వచ్ఛంద సేవాసంస్థలు, కళాశాల యాజమాన్యాలను భాగస్వామ్యం చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టేలా విద్యాశాఖా ధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి, డ్వామా పీడీ ఎ.రాము, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్ఇ దేవప్రకాష్, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల్లో అవకతవకలపై విచారణ

ఉంగుటూరు :మండలంలోని వెల్లమిల్లిలో పంచాయతీ నిధుల్లో అవకతవకలపై ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి చంద్రశేఖర్ గురువారం విచారణ చేపట్టారు. పంచాయతీ నిధుల్లో లక్షలాది రూపాయిలు అవకవతకలు జరిగినట్లు గ్రామస్తుల ఫిర్యాదు చేసిన క్రమంలో డిఎల్‌పిఒ విచారణకు వచ్చారు. మాజీ సర్పంచి నరమామిడి నాగేశ్వరరావు, గ్రామస్తులు పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించి ప్రజాధనాన్ని కాపాడాలని గ్రామస్తులు డిఎల్‌పిఒను కోరారు. ఎంక్వైరీ ప్రొసీడింగ్ ప్రకారం వ్యవహరిస్తామని, విచారణకు హాజరు కాని సెక్రటరీ బాలాజీకి మరోసారి నోటీసులు ఇస్తామని డిఎల్‌పిఒ గ్రామస్తులకు చెప్పారు. బదిలీపై రాచూరు వెళ్లిపోయిన కార్యదర్శి బాలాజీ నుంచి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి విస్తరణాధికారి కెవి.గిరిధర్ పాల్గొన్నారు.

ప్రత్యేక సంక్షిప్త సవరణకు సహకరించండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025కు సంబంధించి షెడ్యూల్ ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు సంబంధిత బిఎల్‌ఒలు ఓటర్ల జాబితాలోని వివరాలు ధ్రువీకరించేందుకు డోర్ టు డోర్ సర్వే చేస్తారని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సంబంధిత బిఎల్‌ఒలు మీ ఇంటి వద్దకు వచ్చినప్పుడు పూర్తి వివరాలు తెలియజేయాలని కోరారు. 2025 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ అర్హత కలిగి ఓటర్ల జాబితాలో నమోదు కావొచ్చని, మార్పులు, చేర్పులు నమోదు కోసం బూత్ స్థాయి అధికారి వారిని కాని సంబంధిత మండల రెవెన్యూ అధికారిని కాని సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.



కటాక్షిని సత్కరిస్తున్న గ్రామ సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు

విద్యా వ్యాప్తికి బేబి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి ఎంపిపి ప్రాథమిక పాఠశాల-1లో ఉపాధ్యాయునిగా పనిచేసి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేస్తున్న చిన్నం బేబీదైవకటాక్షి విద్యా వ్యాప్తికి చేసిన సేవలు అభినందనీయమని గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. కటాక్షి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు కె.తులసి ఆధ్వర్యంలో వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కటాక్షి ఉపా ధ్యాయునిగా పనిచేసిన ప్రతి ప్రాంతంలో విద్యార్థుల అభ్యున్నతికి, వారి ఉన్నత స్థానాలకు చేరేందుకు తన వంతు సహాయ, సహకారాలు అందించేవారన్నారు. అనంతరం తన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులకు స్టీల్ ప్లేట్లను కటాక్షి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ప్రముఖులు సుధాకర్, శరీన్, బాల భాస్కర్, ఎంఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి ఏలూరు అర్బన్

హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ 2024 పురస్కారాలు జిల్లాలోని ఐదు పాఠశాలలకు వచ్చాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు. నేషనల్, రాష్ట్ర స్థాయి, అంతర్ జిల్లా క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాల (బాలురు) పెదవేగి, సెయింట్ థెరిసాస్ బాలికల ఉన్నత పాఠశాల ఏలూరు, కస్తూరిబాయి మున్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాల ఏలూరు, ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ రెసిడెన్షియల్ పాఠశాల వట్లూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోణంగి ఈ పురస్కారాలు అందుకున్నాయని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో మెమోంటో, సర్టిఫికేట్, దుశ్శాలువాలతో సన్మానించారు.

యుద్ధ ప్రాతిపదికన రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

యుద్ధ ప్రాతిపదికన నగరంలో రోడ్ల మరమ్మతులు, మేజర్ డ్రెయినేజీల్లో షిల్ట్ తొలగించే పనులు జరుగుతున్నాయని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు అన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ ఆదేశాల మేరకు రూ.80 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి నగరంలో ప్రధాన రోడ్ల మరమ్మతులు, మేజర్ డ్రెయినేజీల్లో ఉన్న షిల్ట్ తొలగించనున్నట్లు తెలిపారు. పది రోజుల క్రితం పనులు ప్రారంభించారని, వర్షాల కారణంగా మధ్యలో పనులు ఆలస్యమైందన్నారు. వన్ టౌన్, టూ టౌన్ ప్రాంతాల్లో సుమారు 13 మేజర్ డ్రెయినేజీల్లో షిల్ట్ తొలగిస్తున్నామన్నారు. ప్రధాన రహదారులు మరమ్మతులు చేస్తున్నామన్నారు. జరుగుతున్న పనులను గురువారం ఆకస్మిక తనిఖీ చేసినట్లు చెప్పారు. మేజర్ డ్రెయినేజీల్లో బ్రాందీ షాపుల దగ్గర సీసాలు, కూల్ డ్రింక్ షాపుల దగ్గర ప్లాస్టిక్ వ్యర్థాలు పడి ఉండడం కారణంగా డ్రెయినేజీలు పూడుకుపోయి వర్షపు నీరు రోడ్లపై పొర్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. షాపు యజమానులు, ప్రజలు డ్రెయినేజీల్లో వ్యర్థాలు వేయకుండాకార్పొరేషన్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని పెదబాబు ప్రజలను కోరారు. అలాగే డ్రెయినేజీలో నుంచి తీసిన షిల్టు ఆరిన వెంటనే అక్కడ నుంచి తరలించన్నుట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఇ తాతబ్బాయి, ఎఇ రఫీ, కార్పొరేటర్లు బత్తిన విజయకుమార్, దేవరకొండ శ్రీనివాసరావు, నున్న కిషోర్, దారపు తేజ, ఆరేపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని డి3-ఏలూరు సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి శనివారపుపేట సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 30వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న అని 11 కెవి ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ తెలిపారు. శనివారపు పేట, శ్రీరాంనగర్, విద్యనగర్, శాతవాహన నగర్, దొండపాడు, న్యూ ఆశోక్ నగర్, దుగ్గిరాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్య వివాహంతో ఆరోగ్య సమస్యలు

ప్రజాశక్తి - మండవల్లి

చిన్న వయసులో వివాహం చేసుకుంటే ఆరోగ్యపరమైన ఎన్నో సమస్యలు తలెత్తుతాయని ఆరోగ్య విస్తరణ అధికారి టిఎస్.బాబు స్పష్టం చేశారు. మండలంలోని చింతపాడు లోకుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్‌కెఎస్‌కె ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిషోర్ స్వాస్త్య కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది యుక్త వయసు బాలికలకు వివాహ వయసుపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో వివాహం చేసుకుంటే శరీరంలో ఆరోగ్యపరమైన దుష్ఫలితాలు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి పి.లావణ్య, ఎంపిహెచ్ఎ ఎం.భాస్కర్, ఆశా కార్యకర్త గీతాంజలి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

మహిళ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తుమ్మగూడెం పంచాయతీ శివారు గ్రామమైన టి.గుడిపాడు గ్రామానికి చెందిన మహిళ మృతి చెందింది. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...టి.గుడిపాడుకు చెందిన కొమ్ము పాపారావు (మహేష్)కు, పర్వతాపురం గ్రామానికి చెందిన స్వాతి(28)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. గత కొన్ని రోజులుగా స్వాతి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది టి.గుడిపాడుకు వచ్చింది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున స్వాతి మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతురాలి పుట్టింటివాళ్లు, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి.రామకృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సర్ సిఆర్.రెడ్డి కళాశాల తెలుగు శాఖ, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా బోధన ఆధునిక పద్ధతులు అంశంపై గురువారం అతిథి ఉపన్యాస కార్యక్రమం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సదస్సుకు కళాశాల కరస్పాండెంట్ కెవి.సుబ్బారావు విశిష్ట అతిథిగా పాల్గొని తెలుగు భాష వైభవాన్ని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.రామరాజు మాట్లాడారు. ఈ సదస్సుకు ప్రధానవక్తగా శతావధాని డాక్టర్ బులుసు అపర్ణ హాజరయ్యారు. తెలుగు శాఖాధిపతి మేడపాటి శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు బి.శంకర్, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : ఏలూరు మండలం వెంకటాపురంలోని ఎంపిపి పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతిని, తెలుగు భాషా దినోత్సవాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు జి.కృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషను ముందు తరాలకు అందించడం మనందరి కనీస బాధ్యత అని అన్నారు. తెలుగు ఉపాధ్యాయిని డి.మేరీరాణి దుశ్శాలువతో సన్మానం చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు. ఉపాధ్యాయులు కృష్ణకుమారి, రమాకుమారి, రామకృష్ణ, ఆసియా సుల్తానా, ప్రభాకరరావు, బెనజీర్, నాగపద్మిని, విద్యా కమిటీ ఛైర్మన్, అనూష పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : తెలుగు భాషావేత్త గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం జీలుగుమిల్లిలోని శ్రీ విద్యానిధి పాఠశాలలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా విద్యార్థులకు అవగాహన కల్పించారు. వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : స్థానిక శాఖా గ్రంథాలయంలో ప్రముఖ రంగస్థల నటులు దుగ్గిరాల పరమేశ్వరరావు, గంగామణి దంపతులను, తెలుగు ఉపాధ్యాయులు ఎస్.పద్మలతను ఘనంగా సన్మానించారు. పలు పాఠశాలల విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను దేవదాయ ధర్మాదాయ శాఖ ఇఒ శింగనపల్లి శ్రీనివాసరావు అందించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సాహితీ మిత్రులు చక్కా జగన్మోహనరావు, ఎల్ ఆర్ పోలిశెట్టి, బాబూరావు, విఠల్ పాండురంగారావు, కె సత్యనారాయణ మూర్తి, శాఖా గ్రంథాలయాధికారి జె రమేష్ బాబు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : గ్రంథాలయంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగులో వాడుక భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి అని గ్రంథాలయ నిర్వాహకులు కొనియాడారు.

టి.నరసాపురం : తెలుగులో విద్యా బోధనతో విద్యార్థుల్లో పరిపూర్ణ వికాసం చేకూరుతుందని విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం (గిడుగు రామ్మూర్తి జయంతి), జాతీయ క్రీడా దినోత్సవం (మేజర్ ధ్యాన్ చంద్ జయంతి) వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపేలా పదాల వరుసలో కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. అంతే కాకుండా విద్యార్థులకు పాటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

భీమడోలు : మండలంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. దీనిలో భాగంగా భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నేవారిగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తెలుగు భాష పై విద్యార్థుల ఆసక్తిని తెలియజేసేందుకు అ అక్షరం ఆకారంలో ఏర్పడి ప్రదర్శన చేశారు.

పెదపాడు : వట్లూరు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి గురించి, ప్రముఖ హాకీ ప్లేయర్ ధ్యాన్ చంద్ గురించి విద్యార్థులు ఉపన్యాసం ఇచ్చారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి - చాట్రాయి

జాతీయ క్రీడా దినోత్సవం వేడుకల్లో భాగంగా మండలంలోని తుమ్మగూడెం ఎంపిపిఎస్ ఉర్దూ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆటలు పోటీ నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంపా వెంకట్రావు తెలిపారు. ఆటలు ఆడటం వల్ల మానసిక ఉల్లాసం, శరీర అవయవాల పెరుగుదల, విద్యార్థుల్లో ఐక్యత నెలకొంటాయన్నారు. తెలుగు భాష మహోత్సవాన్ని పాఠశాల లో నిర్వహించారు. విద్యార్థులకు కోకో, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్, పాటల పోటీలు నిర్వహిం చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదం డ్రులు, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఎస్‌కె.హసీనా పాల్గొన్నారు.

ముసునూరు :ఒలింపిక్స్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన వ్యక్తులను గౌరవించడం మన సంప్రదాయమని రమణక్కపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పివిఎస్.రామకృష్ణ చెప్పారు. విద్యార్థులకు ఆటల పోటలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సుధ రూ.40 వేల విలువైన క్రీడాసామగ్రి స్కూల్‌కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు వాకా నాగరాజు, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు ప్రధానోపాధ్యాయిని పి.రాధికారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడల పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, మల్లేశ్వరి, కృష్ణవేణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, మనోహరం, విజయలక్ష్మి, సాకా రవి, బాలు, రంగారావు, విఠల్ బాబు, పుల్లారావు, పాల్గొన్నారు.

ఉంగుటూరు : ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని కైకరం జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాడు జి.ప్రసాదరావు చెప్పారు. పాఠశాల విద్యార్థులకు 2 కె రన్ పరుగు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రసాంశాప్రతాలు అందించారు. గతేడాది పలు క్రీడా పోటీల్లో పాల్గొన్న 125 మంది క్రీడాకారులకు రూ.50 వేల విలువైన క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయుడు అందించారు. తొలుత ఆటల పోటీలను గ్రామ సర్పంచి సలగల గోపీ ప్రారంభించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ అల్లూరి జగదీశ్వరి, వైస్ ఛైర్మన్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడి : ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కళాశాలలో ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం వివిధ క్రీడల్లో విజేతలకు ప్రిన్సిపల్ దాసరి మేరీ ఝాన్సీరాణి చేతులమీదుగా మెడల్స్ అందించారు.

గిరిజన గ్రీవెన్స్‌కు 285 అర్జీలు

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

జెసి, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు/బుట్టాయగూడెం

గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌ను కోట రామచంద్రాపురం ఐటిడిఎ కార్యాలయంలో గురువారం నిర్వహించగా గిరిజన ప్రాంతాల నుంచి 285 అర్జీలు అందాయి. వీటిని సత్వరమే విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. ప్రతి నెలా నాలుగో గురువారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. గిరిజన గ్రీవెన్స్‌లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కె.అద్దయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై చర్యలు

ఆర్‌డిఒ భవానిశంకరి

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ పనుల్లో చోటు చేసుకున్న అవకతవకలపై చర్యలు తీసుకుంటామని నూజివీడు ఆర్‌డిఒ వై.భవానిశంకరి చెప్పారు. మండలంలోని రమణక్కపేట గ్రామ సచివాలయంలో వారం రోజుల క్రితం నిర్వహించిన గ్రామసభలో మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. ఉపాధి హామీలో చోటు చేసుకున్న అవకతవలను, సమస్యలను గ్రామస్తులు మంత్రికి వివరించారు. ఉపాధి హామీ పనులకు రాకుండా ఇంటి వద్ద ఉన్నవారికి ఉపాధి పని నగదు జమ చేశారని, వంద రోజులు పని కల్పించలేదని, ఒకరిద్దరికి ఒకటి, రెండు సంవత్సరాలు పని చేసినా వారికి నగదు జమ కాలేదని, ఇలా పలు అంశాలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఉపాధి హామీలో అవకతవకలపై ఆర్‌డిఒ వై.భవానిశంకరి గురువారం రమణక్కపేట వచ్చి విచారణ చేపట్టారు. పనులు చేసి నగదు జమ కానివారనికి నగదు జమ అయ్యేలా, పనులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు. మండల కేంద్రమైన ముసునూరులో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖాధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - మండవల్లి

మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శాస్త్రవేత్త సుధామ ఫౌండేషన్ అధినేత సుధాబత్తుల విజయకుమార్ చెప్పారు. వన మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండవల్లి స్టేషన్‌లోని ఆయన నివాసంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని అన్నారు. ఇప్పటికే సుధామ ఫౌండేషన్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్, పాఠశాల ఆవరణంలో, ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి వాటికి ఐరన్ గార్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు భాస్కరరావు, సుధాబత్తుల నాగేంద్రమణి పాల్గొన్నారు.

వన మహోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.30 వేల విలువైన 200 పైగా మొక్కలు నాటుతున్నామని ప్రధానోపాధ్యాయులు మాధవ్ కుమార్ తెలిపారు. గతంలో కూడా రూ.15 వేలతో కడియం నుంచి మొక్కలను తీసుకొచ్చి నాటామని చెప్పారు.

31నే పెన్షన్ల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఆగస్టు 31న అన్ని రకాల పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా ఆగస్టు 31న పెన్షన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దనే సచివాలయ ప్రభుత్వ సిబ్బందితో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై రైతు సంఘం హర్షం

రాజకీయాలకు అతీతంగా సంఘాలను ఏర్పాటు చేయాలి

రైతు సంఘం ఆధ్వర్యంలో బొమ్మిడిలో రైతుల సమావేశం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సాగునీటి సంఘాల ఎన్నికలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం బొమ్మిడిలో నిర్వహించిన రైతుల సమావేశంలో రైతులు, కౌలు రైతులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం బొమ్మిడి సహకార సొసైటీ సమీపంలో నిర్వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమన్నారు. అయితే రాజకీయాలకు అతీతంగా సాగునీటి సంఘాలను ఏర్పాటు చేయాలని కోరారు. గోదావరి, కృష్ణా డెల్టాల కాలువల ఆధునీకరణకు నిధులు కేటాయించి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా పరిధిలో కృష్ణా, గోదావరి డెల్టాల ఆయకట్టు భూములు శివారు ప్రాంతం కావడంతో సక్రమంగా సాగునీరు అందడం లేదన్నారు. ముంపునకు ముందు సాగునీరు అందడానికి వెనుక అన్న విధంగా ఉండడంతో అన్నదాతలు నష్టపోతున్నారని చెప్పారు. గుండుగొలను డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ గుత్తికొండ వెంకట కృష్ణారావు మాట్లాడుతూ గోదావరి, కృష్ణా డెల్టాల పరిధిలో కాలువలపై తూములు ఏర్పాటు చేసి వంద సంవత్సరాలకు పైగా అయిందని చెప్పారు. ఈ తూములను ఆధునీకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, దుడే కేశవ, వానపల్లి సత్యనారాయణ, దుడే రాంబాబు, నక్కా ధనుంజయరావు, మారిశెట్టి లక్ష్మీనారాయణ, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు అండగా ఉంటా

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడానికి సిఎం చంద్రబాబు నిర్దిష్టమైన ప్రణాళికలు సిద్ధం చేశారని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించిన ఆయన పనుల పురోగతి గురించి సంబంధిత ఇంజినీర్లను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలోనే పోలవరం ప్రాజెక్టు సత్వరమే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దఢ నిశ్చయంతో ఉన్నారన్నారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం పునరావాసాల కల్పన తదితర అంశాల విషయంలో కూటమి ప్రభుత్వం పార్లమెంటులో రూ.12,500 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా పైడిపాక పునరవాస గ్రామస్తులు ఎన్.అబ్బులు, ఎన్.నరేష్ తమకు పరిహారాలు అందలేదని త్వరగా అందేలా చూడాలని ఎంఎల్ఎకు వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఎంఎల్ఎ సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

అన్ని తరగతుల ప్రజలకు సమన్యాయం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్ని తరగతుల ప్రజలకు సమన్యాయం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రజా రంజకపాలనను అందిస్తుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయానికి తమ సమస్యలు తెలుపుకునేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధితాధికారులను ఎంఎల్ఎ బడేటి చంటి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ అన్ని తరగతుల ప్రజలకు సమన్యాయం చేయడంతో పాటు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు.

వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆసుపత్రి సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించేవారిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. ముదినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న అభివృద్ధి, సమస్యలపై చర్చించి, ఇక్కడ రోగులకు అందాల్సిన సదుపాయాల గురించి నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ముదినేపల్లి-2 ఎఎన్ఎం నిమ్మగడ్డ ఎలినారాణి ఉత్తమ ఎఎన్ఎంగా అవార్డు అందుకున్నారు. ఆమె చేసిన సేవలను అభినందించారు. సమావేశం అనంతరం ఆసుపత్రిని సందర్శించి వైద్య సిబ్బంది సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి శాంతిశ్రీ, మండల పరిషత్ ఎఒ రమణబాబు, జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ కేబినెట్ సమావేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టుకు నిధులను మంజూరు చేసి డిపిఆర్‌ని ఆమోదించడం, పోలవరం ఎడమ కాల్వ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి నిర్ణయం తీసుకోవడాన్ని రాష్ట్ర ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో స్వాగతించారు. అదే విధంగా ప్రాజెక్ట్ నిర్వహణకు సరిపడా సిబ్బంది ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. డెల్టాలో పని చేస్తున్న సుమారు 250 మంది లస్కర్స్ జీతాలు పది నెలల నుంచి రావటం లేదని, వారికి ఆప్కోస్ ద్వారా జీతాలు పెంచి, సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు.

పేరు మరియు చిరునామా మార్పు

నేను, **తమ్మిశెట్టి విజయ లక్ష్మి,** W/o **ముగ్గళ్ల పవన్ కుమార్** (కొత్తపేరు), H.No. 4-87, లంక చేను వీధి, రామాలయం ఎదురుగా, పిప్పర గణపవరం మండలం, ఏలూరు Dt, A.P, పిన్: 534197, నా ఆధార్ నెం. **812778847774** ప్రకారం, నా పాస్‌పోర్ట్ నెం.**U7532038** రు లో నా భర్త పేరు మరియు చిరునామా **ముగ్గల్ల పవన్** కుమార్ (పాతపేరు), ఇం.నం.2-117, కొత్తపేట, మోర్త, ఉండ్రాజవరం మండలం, పశ్చిమగాదావరి, పిన్: 534227, A.P, చిరునామా,తప్పుగా పేర్కొనబడ్డాయి. కావున నా భర్త యొక్క కొత్త పేరును ఇకపై అన్ని లావాదేవీలకు ఉపయోగించునని తెలియజేయడమైంది.

దస్తావేజులు పోయినవి

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.. నా క్లయింట్ అయిన రాచపల్లి వెంకట సత్యనారాయణ S/o.సూర్యనారాయణ, రామసింగవరం గ్రామ కాపురస్తులు పెదవేగి మండలం వారు ది.27-8-2024వ తేదీన ఉదయం 10.00 గంటల సమయంలో వారి ఇంటి స్థలమునకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్ నెంబర్ 4912/1983 ఏలూరు (SRO) దస్తావేజులు జిరాక్స్ తీసుకొను నిమిత్తం రామసింగవరం సెంటర్‌కు తీసుకొని వెళ్లగా పోగొట్టుకున్నారు. సదరు డాక్యుమెంట్‌ను రామసింగవరం పరిసర ప్రాంతంలో వెతికినను దొరకలేదు. సదరు ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది ఫోన్ నెంబర్‌కు సంప్రదించగలరు. సదరు దస్తావేజులు ఆధారంగా చేయబోవు ఏవిధమైన లావాదేవీలు అన్యాక్రాంతములు చెల్లవని మరియు నా క్లయింట్‌ను ఏవిధమైన బైండ్ చెయ్యవని తెలియజేయుచున్నాను.

యాదగిరి ప్రసాద్, అడ్వకేట్
గూడ్స్ సైడ్ రోడ్డు, ఏలూరు.
ఫోన్ : 9440077503

BEFORE THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT NARASANNAPETA O.S.No.51/2020

Between:
M/s. Potnuru Venkate Ramana Murthy ---Plaintiff
And:
Guravayya Gadi Proprietor, Vasavi Traders, Bheemavoram, W.G Dist. ---Defendent

Notice To the defendant as per i.A 366/2024 orders date 19-07-2024

To,
Guravayya Gadi, Properietor, Vasavi Traders, Aged About 58, Sanjana Heights, Balasmudi, Bheemavaram Town(Post & Mandal), West Godavari Distt. AP. State.

It is to Informe you that the Plaintiff filed the above Suit OS.51/2020 against you on The filed of The honourable court of the junior civil judge at narasanapeta, Srikakulam District is Stand's Posted to **04-09-2024** for your appearance. And you are to appear on 4-9-2024 at 10.30 AM., Before the honourable court of the junior civil judge at narasanapeta, either in person or Through your Advocate with out fail. otherwise The above Suit will be decided by the honourable court in your absence will be Treated as EXPARTE Hence This notice

**G.V.V.G. NAIDU
ADVOCATE FOR THE PLAINTIFF
NARASANNAPETA,
SRIKAKULAM, CELL: 9440126453**

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన శ్రీ మునగాల వెంకట శ్రీనివాస్ తండ్రి మునగాల సత్యనారాయణ (లేటు), మునగాల సీతా మహాలక్ష్మి (లేటు), ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, దెందులూరు గ్రామం, వాటర్ ట్యాంక్ రోడ్డు, 9వ వార్డు, డోరు నెం.9-50, గారు నాకిచ్చిన సంజాయిషీ మేరకు సమస్త ప్రజానికానికి తెలియజేయునది ఏమనగా...

నా క్లయింట్ తల్లిగారు (లేటు) మునగాల సీతామహాలక్ష్మీ గారు, పల్లా వెంకట హరినారాయణ గారి పైన దావా వేసి, గౌరవ ఫ్యామిలి కోర్టు కమ్ 7వ అదనపు జిల్లా జడ్జి, పశ్చమగోదావరి జిల్లా, ఏలూరు ద్వారా తేదీ 12-07-2016, ఎ.యస్.నెం. 17/2011 రు ప్రకారం ఈ క్రింద పెద్యూలు ఆస్తుల యందు 1/2 (సగం) ఆస్తి యందు సంపూర్ణ హక్కు ఉన్నది. సదరు పల్లా వెంకట హరినారాయణగారు ది. 21-08-2024 మరణించిన దరిమిలా వారి కుటుంబస్తులు, ఈ క్రింది షెడ్యూలు దాఖలా భూమిని ఆక్రమంగా అమ్ముటకు ప్రయత్నం చేయుచున్నారని తెలిసినది. ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిలో నా క్లయింట్ వాటాకు సంబంధించిన ఆస్తి పై ఏవిదమైన ఆర్థిక మరియు ఏ ఇతర లావాదేవీలు చెల్లనేరవనియు అటువంటి చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడినవారు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యలగుదురని తెలియజేయుచున్నాను.

షెడ్యూలు ఆస్తి : (1) ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, ఏలూరు సబుడి కొవ్వలి గ్రామంలోని ఆర్.యస్.నెం.94/1, రు, ఆర్.యస్.నెం.95ర్లు, దాఖలా య.1.60 ట్లు. (2) ఏలూరు జిల్లా దెందులూరు మండలం భీమడోలు సబుడి, దెందులూరు గ్రామంలోని ఆర్.యస్.నెం.232/2బి3రు, 232/2సి1రు, 232/1ఎ ర్లు, దాఖలా య.1-59.1/2 ట్లు
(3) ఏలూరు జిల్లా, దెందులూరు మండలం, భీమడోలు సబుడి, దెందులూరు గ్రామ పంచాయతీ, దెందులూరు గ్రామంలోని గ్రామకంఠం నందు చ.గ. 373లు స్థలం నందు డోరు నెం. 9-50 రు గల ఇల్లు. సదరు పైన తెలిపిన యావత్తు ఆస్తి నందు సగం వాటా (1/2) ఎట్టి వారికి అన్యాక్రాంతం కాజాలదని తెలియజేయుచున్నాను. కావున గమనించుదురు.

శ్రీ కారుమంచి నాగేశ్వరరావు
ఏలూరు. న్యాయవాది. శాంతిగనర్, 5వ వీధి,
28-08-2024 సెల్ : 9849244807

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, ELURU O.S.NO. 20/2011

Between:
Smt. Vemula Menda Leela Veera Venkta Lakshmi Devi & others ***...PLAINTIFFS***
AND
Sri Veera Prathapa Korukonda Hamveera Divyya Santhisri & others ***...DEFENDANTS***

NOTICE

9. Burri Prasanna Lakshmi, Wife of Lakshmana Rao, D/o Murali Hari Nadhan, resident of 6 th Ward, Sreeramavaram Village, Yepugunta Sivaru, T.Narsapuram Mandal, W.G.District.

Whereas the plaintiff filed suit for partition of the plaint schedule property against the defendants The Honourable court order notice in the above 9 th defendant.

Whereas as the notice addressed to the 9th defendant in the above suit could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to the 9 th defendant by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru **on 12-09-2024 at 10.30 A.M.** and state your objections if any. Lest the suit will be decided exparte.

(As per court orders)

DEVULAPALLI KRISHNA SASTRY
Eluru, Advocate
Dt.29-08-2024 Eluru